

సార్వభౌమ

"ఏఁవోయ్! ఇదిగో! ఇటురా! నీకో హాపీ న్యూస్!"

"ఏఁటండి! ఉండండి-వస్తున్నా."

"త్వరగా రావోయ్."

"ఆఁ! వచ్చాను-ఏమిటో చెప్పండి."

"బహుమతి ఏమిస్తావో చెప్పు"

"ముందావార్త ఏమిటో చెప్పండి"

"ఊహూ(:...."

"మీ రడిగిందిస్తాను సరే నా! ఇక చెప్పండి"

"ఇస్తావు కదూ?"

"సరే- అన్నానా?"

"అలా అవుతే నీ కథ ప్రచురించటానికి అంగీకరించారోయ్!"

"ఓస్! అంతేనా?" అంటూ ఇంట్లోకి పోయింది కమల.

రామారావు ఉసూరుమని కుర్చీలో కూలబడ్డాడు. కార్డుముక్క మరొకసారి చూశాడు. "శ్రీమతి కమలగార్కి, మీ కథ "పిల్లి-పిల్లా" ప్రచురించడానికి అంగీకరింపబడిందని గ్రహింపగలరు."

కార్డుని నలిపి పారేయాలనుకున్నాడు రామారావు. అయినా లేని ఉత్సాహం తెచ్చుకుని-

"కమలా! ఏ కథ. ఏ పత్రికో తెలుసునా!" అంటూ వంటింట్లోకిపోయాడు.

"ఏదో ఒకటి లేండి "ఎలుకా-ఎన్నమ్మా" లేకపోతే "పిల్లి-పిల్లా" 'రజనీ' పత్రికలో కాకపోతే పద్మరాగం' చిత్ర మాసపత్రికలో-అంతేగా?"

"పిల్లీ-పిల్లా-యేనోయ్! ఎంత ఈజీగా కనుక్కున్నావు! మరి నా బహుమతీ."

"బహుమతి సంగతి తరువాతగానీ ముందు స్నానం చేద్దురు-నీళ్ళు చల్లారి పోతాయి."

"అంతేనా?"

"అంతే!"

"సరే! ఏం చేద్దాం?" అంటూ కాళ్ళీడ్చుకుంటూ వంటింట్లోంచి బయట పడ్డాడు.

"రామారావూ! అయిపోయింది— నీ భార్య రచయిత్రి అయిపోయింది, ఇంక నీ కమల రామారావు భార్య కాదు! నీవే రచయిత్రి భర్తవు!—అయ్యో ఎంత ఖర్మ?" అనుకున్నాడు రామారావు.

"ఏమండీ! ఎంతసేపు! త్వరగా స్నానం కానియ్యండి."

"ఆ(! వస్తున్నా."

రామారావు మళ్ళీ అనుకున్నాడు— "రామారావూ! అయిపోయింది. నీ భార్య రచయిత్రి అయిపోయింది." రామారావు ఉద్దేశంలో కథ పడింది అని సంతోషం పడనివాడు రచయిత అయిపోయినట్లే.

మొట్టమొదట కమలకథ పడిన రోజు. రామారావుకింకా గుర్తే! ఈ రోజులాగానే ఆ రోజు కూడా రామారావు హాప్పీ న్యూసన్నాడు. బహుమతీ అన్నాడు, కథ పడిందన్నాడు. ఎగిరింది కమల. బొంగరంలా తిరిగింది. అలిసిపోయిన బొంగరంలా తన వళ్ళో పడి అడక్కముందే బహుమతీ ఇచ్చింది. అప్పటినించీ ఎన్ని సార్లో అలా.

ఆఫీసులో ఏ కార్డు ముక్క వచ్చినా,

"నీ భార్య వ్రాసిన కథ పబ్లిష్ చేస్తారను కుంటా" అని అందరు అనటం మొదలు పెట్టారు. రామారావుకు కొన్నిసార్లు చిరాకేసింది. కొన్నిసార్లు సంతోషము కలిగింది.

"ఇంతవరకు ఆఫీసులోవాళ్లు రామారావు భార్య రచయిత్రి అన్నారు. నేడు- అయ్యో! కమల తనే గొప్ప రచయిత్రి అనుకుంటూంది. రేపు- ఆఫీసులో వాళ్ళు తన్ను రచయిత్రి భర్తంటారు. రామారావూ! నీ పని ఖాళీ——" అనుకున్నాడు రామారావు.

"ఏంటండీ? లోపలేం చేస్తున్నారు? స్నానం చేస్తున్నారా- లేక జపం చేస్తున్నారా?"

"వస్తున్నా" అంటూ పరుగెత్తాడు రామారావు.

"టిఫిను తీసుకుని, కాఫీ తాగిపోండి" అంది కమల.

టిఫిన్‌చేస్తూ "కమలా!" అన్నాడు.

"ఆఁ!"


"సినిమాకెళ్దాం"

"ఓ యస్!"

"నీవేదో నవల రాస్తున్నావు కదా? టైం వేస్టేమో?"

"ఆఁ! అదెంతసేపురెండి! సినిమా కెళ్లొచ్చి ఓ గంట కూచుంటే పది పేజీలు రాయొచ్చు."

"అయ్యో! రామారావూ! అయిపోయింది- చూశావూ! ఇంతకు ముందు సినిమాకు రమ్మంటే 'కథ రాయాలండీ' అనేది. 'కథ రాయడం అంటే తమాషానా! ఎంత ఆలోచించాలి. ప్లీజ్! మీరు పోయిరండి. నా మూడ్ చెడగొట్టద్దు' అనేది" అనుకున్నాడు రామారావు.



"అయినా కమలా! సినిమా చూసొచ్చి ఆలోచించడం కష్టంకదా?"

"ఆఁ! దానిదేముంది! ముందే ఆలోచించి పెట్టుకొన్నా" అంది.

రామారావు ఆలోచించి-క్విక్‌గా ఆలోచిం "చిసినిమాకు తీసుకుని పోతే ఒక గంట సేపే వ్రాసేది .లేక పోతే పేజీలు పేజీలు మింగేస్తుంది. అయితే మరోకొత్త కధో,నవలో మొదలు పెడుతుంది. "నెవర్! నెవర్, ఇక సహించను! నేను రచయిత్రి భర్తని కాలేను——కాకూడదు!" అనుకున్నాడు.

"పద కమలా! మరి సినిమాకుపోదాం" అన్నాడు.

సినిమాలో రామారావు తెగవాగేసాడు. జూలో కోతిలా తల తిప్పి, తిప్పి వాళ్ళనూ, వీళ్ళను చూసాడు. కమల సంతోషపడింది ఆశ్చర్యపడింది. ఇంతకుముందు రామారావు సినిమాకెప్పుడొచ్చినా మాట్లాడేవాడు కాదు. అతని కసలు సినిమాలంటేనే సరిపోదు. తనకోసం వచ్చేవాడు. ఈ రోజేమో

చాలా ఇష్టంగా చూస్తున్నాడు—అను కుంది కమల.

ఇంటి కొచ్చాక కూడా సినిమాను గురించి ఎన్నో కబుర్లు చెప్పాడు. చాలా గొప్ప మార్పే అనుకుని తెల్లకాగితాలు ముందేసుక్కూచుంది కమల.

రామారావు తీవ్రంగా ఆలోచించ సాగాడు. అప్పుడే రెండు సిగిరెట్లు కాలి పోయాయి. హీట్ ఎక్కువైతేగాని ఇంజను స్టార్టు కానట్లు, ఇంకా రామారావు మెదడు స్టార్ట్ కాలేదు. మూడో సిగిరెట్టు అంటిం చాడు....నాలుగు....ఆ యి ం ది....స్టార్ట్ అయింది.

"కమలా! లైటార్పేయి! నాకు నిద్దర రావటంలేదు."

"అలవాటేగా! నిద్రపొండి" అంది కమల.

"ఆర్పమంటుంటే!"

"ఓహ్! అలవాటేగదా నిద్రపొండి అంటే."

రామారావు మెదడు బార్ లైట్ లా వెలి గింది. "అది కాదు కమలా! కరెంటు కంట్రోలు. ఆర్పేయి. లేకపోతే బిల్లు ఎక్కువవుతుంది."

"అయితే సరే ఆర్పేస్తా నుండండి."

"అమ్మా! ఈ రోజుకు తప్పించు కున్నాము" అనుకుని గెలుపొందినందుకు గట్టిగా విజిల్ వేయాలనుకున్నాడు రామా రావు. కానీ రామారావుకు విజిల్ వేయటం రాదు. కాలరు సర్దుకుందామంటే బనియన్ వేసుకొని ఉన్నాడు.

"కమలా!"

"ఏంటండీ" అంది కమల పరుపు సర్దుకుంటూ.


"ఈ రోజు ఏం రాయలేదు కదా?"

"ఫరవాలేదు లెండి! రేపు పూర్తి చేయచ్చు" అంది.

"అయ్యో! రామారావూ!అయిపోయింది కమల వ్రీ కావటంలేదు-రచయిత్రి అయి పోయింది. దేవుడా! భగవంతుడా! ఏడు కొండలవాడా-వెంకటేశ్వరా రక్షించు.... ఆఁ దొరికింది – రేపు అడగాలి-వెంకటేశు గాడయితే దీని నుండి తప్పించుకునే మార్గం చూపిస్తాడు." అనుకొని సంతృ ప్తిగా కళ్లు మూసుకున్నాడు రామారావు.

రామారావు ఏరోజు లేంది ఆ రోజు ప్రొద్దునే లేచాడు. గబగబా ఆఫీసుకు అర గంట ము ం దే పరుగెత్తాడు – రామా రావుకు తెలుసు ఆఫీసుకు ఎవరూ అర గంటముందు రారనే అందరూ అర గంట ఆలస్యంగానే వస్తారనీ. అయినా తొందర – వెంకటేశుగాణ్ణి పట్టుకోవాలి. వాడితో సెలవు పెట్టించి, ఇద్దరు కలిసి ఎక్కడికయినా పోయి, ప్రశాంతంగా కూర్చుని ఆలోచించి, వాణ్ణి ఆలోచింపజేసి, తాను రచయిత్రి భర్త కాకుండా ఉండే మార్గం కనిపెట్టాలి.

ఎవరైనా అనొచ్చు-రాయద్దంటే సరి




పోలా అని. ఇది రామారావుకూ తోచక పోలేదు. మళ్ళీ అంతలోనే "అయ్యో! రామారావూ, ఎలా? నీవు రాయద్దంటే ఎలా? ఒకప్పుడు వ్రాయమన్నావు, రాస్తే ఎగిరి దుమికి పోస్టుడబ్బాలో వేసావు. ఏ పత్రిక లోనయినా వేయకుంటే, విశ్వామిత్రుడిలా వాళ్ళను శపించావు. ఆ పత్రికలు కొత్తవి కొని, కోపంతో వాటిని కాల్చి బూడిద చేశావు. ఓహ్! ఈ ప్లాను బాగాలేదు ఈ వెంకటేశుగాడు ఇంకా రాలేదేమీ! ఆ వస్తున్నాడు! వెధవ—తాబేలులా నడుస్తున్నాడు.

వెంకటేశు దగ్గరికి రాగానే రామారావు 'హీ! హీ!" అన్నాడు

"కాఫీకి పోదాం" అన్నాడు రామారావు. "పదా" అన్నాడు వెంకటేశు. ఇద్దరు కాఫీ తాగారు. రామారావు కుర్చీని ఇంకా దగ్గరికి లాక్కొని జేబులోనించి, విల్సుపాకెట్ తీసి, వెంకటేశుకొక సిగరెట్టిచ్చి, అగ్గిపుల్ల గీసి అంటించాడు.

"వెంకటేశూ! "

"ఆఁ!"

"పెద్ద చిక్కు ఏర్పడిందోయ్"

"అప్పుడే అనుకున్నా" అన్నాడు వెంకటేశు పొగ రింగురింగులుగా వదులుతూ.

"నీ సహాయం కావాలి."

"ఆఁ! ఆఁ"

"వీడు! వీడి ఫోజులు! వెధవ రాస్కెల్" అనుకున్నాడు రామారావు.

"పాపం! రామారావూ! ఎంత కష్ట కాలం?" అని తనే అనుకున్నాడు.

"ఈ రోజు సెలవు పెడ్దాం" అన్నాడు రామారావు.

"ఆఁ ..." వెంకటేశు పెదవుల మధ్య సిగిరెట్టు వేలాడుతూంది. గబాలున అన్నాడు రామారావు. "మ్యాట్నీకి వెళ్దాం!"

"అహా!" అన్నాడు వెంకటేశు. రామారావుకు చిర్రెత్తుకుంది. "రాస్కెల్! సెలవు పెట్టరా!" అందాం అనుకున్నాడు. అంతలో వెంకటేశు నవ్వి "అబ్బాయీ! నీ అవస్థేమిటి? కధేమిటి?" అన్నాడు.



"చాలా సీరియస్" అన్నాడు రామారావు.

"సిగిరెట్లున్నాయా?" పాకెట్ చూపించాడు రామారావు.

"రైట్" అన్నాడు వెంకటేశు. "రైట్" అన్నాడు రామారావు. పార్కులో కూచుని కథ అంతా విన్నాడు వెంకటేశు. విన్నతర్వాత అయిదు సిగిరెట్లు కాల్చాడు.

ఏమా ఇంకా ఇంజను స్టార్టు కాలేదని చూస్తున్నాడు రామారావు.

"థుర్" అన్నాడు వెంకటేశు. "రైట్" అన్నాడు రామారావు.

"రాయటం వచ్చా?". రామారావు ముఖంలో కొశ్చన్ మార్కు.

"రాయటం వచ్చా?" అని గట్టిగా అరిచాడు వెంకటేశు.

"వచ్చు."

"ఏంటి?"

"రాయటం."

"వెధవా! నీకు కథలు రాయటం వచ్చా?"

"రాదు."

"అయితే రాయటం నేర్చుకొని రాసేయ్" అన్నాడు వెంకటేశు.

రామారావు "ఎలా? కథలు రాయటం ఎలా? ఆఫీసులో ఫైళ్ళు రాయటం కాదు. కథలు రాయటం" అనుకున్నాడు. రామారావుకు బుద్ధి వచ్చినప్పట్నించీ ఒక్కసారేమో రాసాడు అదీ నాలుగవ తరగతిలో 'అనగనగా ఒకరాజు' కథ. "ఇంపాసిబుల్! ఇప్పుడ్రాయలేను" అనుకొన్నాడు.

"వెంకటేశ్! వేరే ప్లాను వెయ్యరా! కావాలంటే ఇంకో పెట్టె సిగరెట్లుతెస్తా" అన్నాడు.

"అబ్బాయి! ఇది ఒకటే మార్గం!" అన్నాడు వెంకటేశు.

రామారావు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. వెంకటేశుకు జాలేసింది!

"పి. జీ. వుడ్‌హౌస్ నవలలువాలుగు చదువు" అన్నాడు.

"చదివాను."

"అయితే ఇంకేం వ్రాసేయి."

"వ్రాయలేను– అవిచదివి నవ్వగలను" అన్నాడు రామారావు.

"అంతేనా?"

"అంతేరా,"

"సరే! సిగరెట్ తే పో! అయిపోయాయి."

రామారావు బుర్ర కాస్త సేపు పని చేసింది "ఓకే" అన్నాడు.

"ఓఖే" అన్నాడు వెంకటేశు.

కాలరు సర్దుకున్నాడు రామారావు.

ఒక నెల రోజులు గడిచిపోయాయి.

ఒకరోజు పొద్దున్న. రామారావు ఆఫీసులో కూచొని ఉంటే టెలిగ్రాంవచ్చింది. ఏమిటోయ్! మీ ఆవిడకి నవలల పోటీలో ప్రైజా?" అన్నాడు సీతారామయ్య. రామారావు వణకుతున్న చేతులతో మరాక సారి చదివాడు, పక్కనున్న కూజా ఎత్తి ఖాళీ చేశాడు! చమటతో కర్చీఫ్ పాలిపోయింది. గట్టిగా ఘీంకరించాడు. కాళ్లు విదిలించాడు! ఎగిరి వెంకటేశును కరుచుకున్నాడు.

వెంకటేశు కుర్చీలోంచి కిందపడ్డాడు. "ఏంటిరా? మోటు సరసం" అన్నాడు. రామారావు నాలుక బయట పెట్టాడు. "హా! హ" అన్నాడు.

వెంకటేశుకు అర్థంకాలేదు. టెలిగ్రాం లాక్కొని చదివాడు. "హాయ్!"అన్నాడు. రామారావును కరుచుకుని ముద్దు పెట్టుకున్నాడు.

"వాట్ హాప్పెన్డ్?" అన్నాడు హెడ్ క్లర్కు.

"రామారావు ప్రయిజ్. ఫస్టు ప్రయిజ్.... నవలల పోటీ " అన్నాడు వెంకటేశు.

"ఏంటయ్యా? ఏంటి" అన్నారు అందరూ.

రామారావు వెంకటేశు కాలరు సర్దాడు.

"రామారావుకు నవలల పోటీలో ఫస్టు ప్రయిజ్" వెంకటేశ

---

◯ చిదంబరం హోటల్ సర్వర్‌కి పది పైసల 'టిప్' ఇచ్చాడు.

'ఇన్సల్ట్ సార్!' అన్నాడు సర్వర్

"ఏమిటోయ్ సర్వారావూ?"

"పది పైసల టిప్ నాకు ఇన్సల్ట్ సార్!_కనీసం ఇరవై పైసలైనా..."

"నిన్ను రెండుసార్లు ఇన్సల్ట్ చెయ్యడం నా కిష్టం లేదోయ్!"

"రామారావుకా. వాళ్ల ...."

"కాదు నాకే" అన్నాడు రామారావు.

"గ్రాండ్ సక్సెస్" అన్నాడు వెంకటేశు.

"నిజమా" అన్నాడు సీతారామయ్య,

"నిజమే అయివుంటుంది. ఆఫీసులో కాగితాలు రామారావీసారి చాలా తీసుకున్నాడు" అన్నాడు హెడ్డు.

"రామారావంటే ఎవరనుకున్నారు- పెరల్స్‌బక్" అన్నాడో ప్రబుద్ధుడు.

"ఆమె ఆడదిరా!" అన్నాడు రామారావు.

"అయితే వుడ్‌హౌస్‌లే" అన్నాడు.

"అవు నవును" అన్నాడు సీతారామయ్య!

"పార్టీ" అన్నారందరూ.

"ఓకే" అన్నాడు వెంకటేశు,

"రైటో" అన్నాడు రామారావు.

పార్టీ అయిపోయింది. హెడ్డు పొగిడాడు రామారావు షేక్స్‌పియర్ అని. వెంకటేశు కాదు పి. జి. వుడ్‌హౌస న్నాడు. రామారావు నేను రామారావునే అన్నాడు.

"అవును రామారావు రావే! షేక్స్‌పియరూ, వోడ్‌హౌసూ ఒకలెఖ్ఖా?" అన్నారందరూ.

ఇంటికి పోయేముందు రామారావు వెంకటేశు జేబులో ఒక సిగరెట్‌ప్యాకెట్ పెట్టి నీ మేలెన్నటికీ మరువలేనన్నాడు.

"ఫరవాలేదు. రేపు ఇంకో ప్యాకెట్ పట్రా" అన్నాడు వెంకటేశు.

"అలాగే" అన్నాడు రామారావు.

ఇంటికి రాగానే "కమలా! చూడు నా ప్రతాపం" అన్నాడు. కాలరు సర్దాడు. మీసం దువ్వాడు, "నువ్వేనా చూడు నా తడాఖా" అన్నాడు.

కమల మల్లెపువ్వులా నవ్వింది. "అవును. మీరు ఆఫీసునుంచి తెల్ల కాగితాలు తీసుకొచ్చి, రాత్రంతా కష్టపడి వ్రాయటం చూసి అనుకున్నాను మీరు నవల రాస్తున్నారని. ఇంతకూ మీరు అసాధ్యులే!" అంది.

"మరేమనుకున్నావు?" అన్నాడు రామారావు.

"శభాష్ రామారావూ! బలే నటించావు. నీ నటనముందు ఎన్. టి. రామారావు బలాదూర్. కమల నమ్మింది. నేను నవల రాసినట్టు. బలే నటించావు. ఆఫీసులో అందరూ నమ్మారు. ఇంతకూ వెంకటేశు జీనియస్. నన్ను రాయి రాయి అని తను రాసేసి నా పేరెట్టాడు. వాడి మేలీ జన్మలో మరవకూడదు. రేపు మరో సిగరెట్ ప్యాకెట్ కొనియ్యాలి" అనుకున్నాడు.

"సినిమాకు- కమలా!" అన్నాడు.

"రైట్" అంది.

"హోటల్ మీల్స్" అన్నాడు.

"ఓయ్యస్" అంది.

మరుసటిరోజు పొద్దున్నే లెటరొచ్చింది "రామారావు, మరొక కధనా సీది" అన్నారంతా

"అఫ్ కోర్సు కావచ్చు" అని తీసుకుని చూశాడు. లైట్స్ ఆఫ్! రామారావు ధన్‌మని కుర్చీలో పడిపోయాడు.

వెంకటేశు మొహంమీద నీళ్లుచల్లాడు. కొద్దిసేపటికి రామారావు మెల్లగా లేచాడు.

ఎవరితో మాట్లాడకుండా బయటకు నడిచాడు.

"రామారావ్! ఏంటిరా?" అని అడిగాడు వెంకటేశ్.

"చూడు" అని కార్డు చూపించాడు. వెంకటేశు చూశాడు. ఇలా చదివాడు "శ్రీమతి కమలగార్కి, మీ నవలకు ఫస్టు ప్రయిజ్ వచ్చింది. మీరు రామారావు అని కొత్తగా కలం పేరు పెట్టుకున్నందుకు సంతోషము"

వెంకటేశు బ్యార్ మన్నాడు.

"అలా అయితే నీవు కాదా రాసింది" అన్నాడు.

"అదికాదురా! నువ్వు రాసి నా పేరు పెట్టావనుకున్నా" అన్నాడు రామారావు.

"లేదురా! నాకు కుదరలేదు. నిన్ను రాయమన్నానుగా. నీవే రాశావనుకున్నా" అన్నాడు.

రామారావు మాట్లాడలేదు. అలా సినిమాలోలా నడిచి వెళ్ళిపోయాడు.

"పాపం! రచయిత్రి భర్త" అనుకున్నాడు వెంకటేశు. *


శ్రీ బాలాజీ వైద్యశాల

డా॥ పి కుమార్‌స్వామి దేవర

ట్రావెలర్స్ బంగళారోడ్ ఫోన్. 551 తెనాలి (ఎ. పి)

బ్రాంచి 9-D శివాజీ స్ట్రీట్ మద్రాసు-17

దీర్ఘరోగులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్తప్రయోగం, అంగము ఎన్నదగుట సంభోగకాలమందు అకస్మాత్తుగా కృశించుట శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కనివిని ఎరుగనంత వీర్య స్తంభనకల్గి హాయినిచ్చును అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది.



(స్వస్థులు) ఉబ్బసము, (దమ్ము) బోదకాళ్ళు, కుష్టు. బొల్లి చర్మవ్యాధులు కడుపులో నొప్పి, చెవుడు. పోస్టుద్వారా గ్యారంటీ చికిత్స చేయబడును.